సాక్షి నిర్మల్

సోమవారం ¦ 7 ¦ జూలై ¦ 2025



'మీ సేవ'లు.. సులభతరం

మీసేవ కేంద్రాల ద్వారా సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సులభతరంగా సేవలు అందించేందుకు కూడా అవకాశం కల్పిస్తోంది. 8లో▸



భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రం పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పీరీలతో ఊరేగింపు నిర్వహించగా భక్తులు మొక్కు తీర్చుకున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
26.0 /24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ అర్చన, హారతి, పల్లకీసేవ నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ–మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

అరుణాచలానికి బస్సు

భైంసాటౌన్: భైంసా నుంచి అరుణాచలానికి ఆర్టీసీ ఆధ్వర్యంలో సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డీఎం హరిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న ఉదయం 11గంటలకు భైంసా బస్టాండ్ నుంచి బస్సు ప్రారంభమై కాణిపాకం, వెల్లూర్, అరుణాచలం, జోగులాంబ మీదుగా బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. రానుపోను చార్జీలు ఒకరికి రూ.5,100 ఉంటుందని తెలిపారు. డిపోలో లేదా వెబ్‌సైట్‌లో టికెట్ బుక్ చేసుకోవాలని, వివరాలకు 9959226005, 9640963321 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భైంసాటౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, నాయకులు ముత్యంరెడ్డి, సుమాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తల్లిదండ్రుల సమావేశం

నిర్మల్ రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని డీఈవో రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులకు డిజిటల్ విద్య, పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించాలని పేర్కొన్నారు. సమావేశానికి ఎక్కువమంది తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశంలోని ఎజెండా అంశాలపై చర్చించాలని పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఫొటోతో సహా వివరాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.


సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న నాగవర్ధన్

లోకేశ్వరం: పండ్ల తోటల సాగుకు ముందుకు వచ్చే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఇన్‌చార్జి డీఆర్డీవో నాగవర్ధన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉపాధిహామీ ఏఫ్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఇంకుడు గుంతల బిల్లులు అందజేస్తామని తెలిపారు. ప్రతీ నర్సరీలో ఈత, ఖర్జూర మొక్కలు పెంచాలని, గ్రామాల్లో మునగసాగు చేసే రైతులను గుర్తించాలని పేర్కొన్నారు. పశువులపాకలు, గొర్రెల షెడ్లు నిర్మించుకునేలా చూడాలని సూచించారు. ఇన్‌చార్జి ఏపీవో అనిల్, నాయకులు శ్రీధర్, చిన్నారావు, కపిల్, శ్యాంసుందర్, సుదర్శన్‌రెడ్డి, భుజంగ్‌రావు, నర్సింగ్‌రావు, నవీన్, రవీందర్‌రావు, సుధీర్‌రెడ్డి ఉన్నారు.

'కడెం'కు ఇన్‌ఫ్లో



ప్రాజెక్ట్‌లో పెరిగిన నీటిమట్టం

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 5,400 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 688.350 అడుగులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

తరువు.. ఆదరువు

ఆరోజు రావొద్దు..!



ఇటీవల సోషల్ మీడియాలో ఈ రీల్ చాలా వైరల్ అవుతోంది. ఇందులో 2050 నాటికి మొత్తం కాలుష్యమయమై పోతుందని, ఆక్సిజన్ సిలిండర్లను భుజానికి వేసుకుని ఉండాల్సి వస్తుందని, ఇప్పుడు నీటిని కొంటున్నట్లు అప్పుడు గాలినీ కొనాల్సి వస్తుందని కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఇది చూడగానే చాలామందికి చెట్లు, పర్యావరణం విలువ తెలిసి వస్తుంది. కానీ.. ఇలా వీడియోలు, రీల్స్ చూసి ఆగిపోకుండా.. తమవంతుగా మొక్కలు నాటాలన్నదే ప్రధాన ఉద్దేశం.



నారు-నీరు పోస్తేనే..

'మొక్కే.. కదా అని వదిలిస్తే..' రేప్పొద్దున ప్రాణవాయువుకు పరేషాన్ కావాల్సి వస్తుంది. మొక్కలను నామ్‌కే వాస్తేగా నాటితే లాభం ఉండదు. కాస్తంత దృష్టిపెట్టి నాటిన మొక్కలను కాపాడుకోవాలి. వాటికి నీరు పోస్తూ.. కాస్త ఎదిగే వరకు సపోర్టునివ్వాలి. ఆ తర్వాత ఆ మొక్కే చెట్టుగా ఎదిగి తన జీవితాంతం ప్రాణవాయువునిస్తూ రుణపడి ఉంటుంది. అందుకే 'రండి.. అందరం మొక్కలు నాటుదాం. ఆక్సిజన్ కొరత లేని సమాజాన్ని కాపాడుకుందాం..' అని ప్రభుత్వం, వివిధ సంస్థలు ప్రజలకు పిలుపునిస్తున్నాయి.

- నేటి మొక్కే రేపటి మన 'ప్రాణం'
- ఇప్పుడే నాటేందుకు అనుకూలం
- ఎంపికే కీలకం.. రక్షిస్తేనే ఫలితం
- అప్పుడే అందరికీ ప్రాణవాయువు

నిర్మల్: తను ఎదుగుతున్నప్పటి నుంచే మన ప్రాణానికి 'ప్రాణం'గా నిలుస్తుంది. ఆకులు తొడిగి నుంచే ఆక్సిజన్ రూపంలో మనకు ప్రాణవాయువు అందిస్తుంది. తాము సంపాదించిన ఆస్తులు తల్లిదండ్రులు బిడ్డలకు ఇస్తారో.. లేదో తెలియదు. ఇచ్చిన ఆస్తులను పిల్లలు కాపాడుకుంటారో, లేదో కూడా చెప్పలేం. కానీ.. మొక్కలు నాటి పెంచి పెద్ద చేస్తే.. ఆ పచ్చని చెట్లు.. పండ్లు, ఫలాలతో పాటు అనుక్షణం తమ పిల్లలకే కాదు, వాళ్ల పిల్లలకూ ఆక్సిజన్ అందిస్తూనే ఉంటాయి. అందుకే పెద్దలు 'వృక్షో రక్షతి రక్షితః' అన్నారు. పచ్చని మొక్కలు నాటాలన్నా.. అవి నాటుకుని ఎదగాలన్నా.. ఇదే మంచి సీజన్. అందుకే తెలంగాణ ప్రభుత్వం కూడా వన మహోత్సవానికి పిలుపునిస్తోంది. అధికార యంత్రాంగమూ అందులో నిమగ్నమవుతోంది.

ఇదే మంచి తరుణం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. గత ప్రభుత్వం 'తెలంగాణకు హరితహారం' పేరిట మొక్కలు విరివిగా మొక్కలు నాటింది. ప్రస్తుత ప్రభుత్వం వనమహోత్సవం నిర్వహిస్తూ మొక్కలు నాటుతోంది. ప్రతీ ఏడాది వానాకాలంలో సీజన్ ప్రారంభం కాగానే వానలు పడి.. భూమి తడిసిన తర్వాత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుంటాం. మెత్తని భూమిలో పచ్చని మొక్కలు పెడితే బలంగా, త్వరగా నాటుకునే అవకాశం ఉంటుంది.

మేలు చేసేవే నాటుకోవాలి

మనకు మేలు చేసే ప్రతి పచ్చని చెట్టునూ దైవంగా భావించి మొక్కుతాం. మన చుట్టూ ఉండే చెట్లు మనకు మేలు కలిగించేవి అయితే మనకు మరింత ప్రయోజనం. అందుకే మొక్కలు నాటేటప్పుడు ఏ రకానికి చెందినవి పెడితే బాగుంటాయో కాస్త తెలుసుకుని పెట్టాలి. చాలామంది మొక్కలు అనగానే గులాబీ, మల్లె, చామంతి తదితర పూల మొక్కలు పెట్టేసి చేతులు కడిగేసుకుంటున్నారు. కానీ.. వాటి కంటే ఎక్కువ ప్రయోజనం కలిగించే వాటిపై దృష్టి పెట్టాలని వృక్షశాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు.

ఏ మొక్కలు ఎక్కడ నాటాలంటే..

పెరడు ఉంటే జామ, కరివేపాకు మొక్కలు నాటాలి. పూల కోసం టికోమా, నందివర్ధనం, గన్నేరు, రోడ్డు పక్కన నిద్రగన్నేరు, రావి, వేప, కదంబం, మారేడు, కానుగ, అడవి చింత, రోడ్ల మధ్యలో భోగన్‌విలియా, గన్నేరు, ఊళ్లల్లో ఖాళీ ప్రాంతాల్లో చింత, మామిడి లాంటి మొక్కలు అధికసంఖ్యలో పెట్టవచ్చు. ఇవి ముందుతరాలకు ఉపయోగపడే చెట్లు.

పచ్చదనం కోసం స్వచ్ఛందంగా..

ఎవరైనా చెబితేనే మనం గాలి పీలుస్తున్నామా..! లేదు కదా. అలాంటప్పుడు 'రండి.. మొక్కలు నాటండి..' అని ఎవరైనా పిలిస్తే గానీ మనం కదలలేమా..!? అని ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా బద్ధకాన్ని వదిలి, కనీసం 10 మొక్కలైనా నాటాల్సిన టైమొచ్చింది. బతకాలంటే.. ఎంతో కొంత ప్రాణవాయువును తయారు చేసుకోవాలన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాల్సిందే. ఆక్సిజన్ ఎక్కడో ఫ్యాక్టరీలో తయారు చేస్తే రాదన్న విషయం తెలిసిందే కదా. అందుకే మొక్కలను నాటి.. వాటిని పెంచి పెద్ద చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం చాలా ఉంది. చిన్న మొక్కను నాటి.. పెంచి పెద్ద చేస్తే చాలు. తనకు బతుకునిచ్చినందుకు.. అది మనకు తన జీవితాంతం బతుకునిస్తుందని గ్రహించాలి. మొక్కలు నాటేందుకు స్వచ్ఛందంగా ముందడుగేయాలి.

ఉపయోగపడేవే నాటాలి



పర్యావరణం బాగుంటేనే మనం బాగుంటాం. పచ్చని చెట్లన్నీ ఉపయోగపడేవే. కానీ.. మనం నాటే ముందే ప్రయోజనకరమైన మొక్కలను ఎంపిక చేసుకోవాలి. పూలచెట్లతో పాటు పెరడు, ఇంటిముందూ ఆక్సిజన్ ఎక్కువగా ఇచ్చే మొక్కలు నాటుకోవాలి. – **డాక్టర్ వీ మధు, వృక్షశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్**

ప్రశ్నార్థకంగా 'బెస్ట్'?



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

- మూడేళ్లుగా విడుదల కాని నిధులు
- జిల్లాలో రూ.3.39 కోట్లు పెండింగ్
- అడ్మిషన్లు ఇవ్వని యాజమాన్యాలు
- అధికారులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో చదువుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం (బీఏఎస్) నిధుల కొరతతో నీరసించిపోతోంది. మూడేళ్లుగా నిధులు రాక స్కూళ్లలో పేద విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చేందుకు యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులను లక్కీ డిప్ పద్ధతిన ఎంపిక చేసి.. ఆయా స్కూళ్లలో అధికారులు ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరించేలా పథకాన్ని రూపొందించారు. అయితే కొన్నేళ్లపాటు పథకం సజావుగా సాగింది. ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలకు బ్రేక్ పడడంతో పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో మూడు పాఠశాలలు

బీఏఎస్ పథకంలో భాగంగా విద్యార్థులకు డే స్కాలర్స్, రెసిడెన్షియల్ విభాగాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఒకటో తరగతిలో ఎంపిక చేసే విద్యార్థులకు డే స్కాలర్స్‌లో.. ఐదో తరగతి నుంచి ఎంపికచేసే విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఎంపిక చేస్తారు. జిల్లా కేంద్రంలోని విజయ, రవి, వశిష్ట పాఠశాలలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. బెస్ట్ అవైలబుల్ పథకానికి ఎంపికైన విద్యార్థులకు ఆయా కేటగిరీల్లో యాజమాన్యాలు అడ్మిషన్లు ఇస్తున్నాయి. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించి విద్యనందించాలి. అయితే మూడేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో 'బీఏఎస్ పథకం కింద అడ్మిషన్లు ఇవ్వలేం.. మునుపు పంపిన వారినీ కొనసాగించలేము' అంటూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు తేల్చిచెబుతున్నాయి.

416 మందికి పైగా విద్యార్థులు

సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ నుంచి ఏటా సుమారు 110 మంది విద్యార్థులను బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు ఎంపిక చేసి పంపిస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 416 మంది విద్యార్థులు బీఏఎస్ పథకం కింద ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. అయితే ఒక్కోస్కూల్‌కు రూ.కోటి పైగా బకాయిలున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు రూ.3.39కోట్ల వరకు నిధులు విడుదల కావాల్సి ఉందని సంబంధిత అధికారుల ప్రాథమిక అంచనా. ఇటీవల కలెక్టరేట్‌లో ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు లక్కీ డిప్ నిర్వహించి.. విద్యార్థులను ఎంపిక చేశారు. కానీ, సమస్య ఇలా ఉంటే.. ఎలా అడ్మిషన్లు ఇస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో తల్లిదండ్రులు

బీఏఎస్ పథకం అమలు ప్రశ్నార్థకంగా మారడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికసంఖ్యలో వచ్చి సమస్యను లిఖితపూర్వకంగా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తున్నారు. కలెక్టర్ స్పందించి ఆయా స్కూళ్ల యాజమాన్యాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు ఇలా..

జిల్లాలో మూడు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లుండగా 416 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. బీఎస్‌ఏ పథకం కింద ఎంపికైన డే స్కాలర్ విద్యార్థులకు ఏడాదికి ప్రభుత్వం రూ.28వేలు, రెసిడెన్షియల్‌కు ఎంపికైనవారికి రూ.42వేలు చెల్లిస్తుంది. కాగా, ఇప్పటివరకు ఆయా స్కూళ్ల యాజమాన్యాలకు రూ.3.40కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో విజయ హైస్కూల్ బకాయిలు రూ.1.95కోట్లు కాగా, రవి హైస్కూల్ బకాయిలు రూ.1.22కోట్లు, వశిష్ట హైస్కూల్ బకాయిలు రూ.21.45లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇబ్బందులు రానివ్వం



మూడేళ్లుగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులు విడుదల కాలేదు. ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పిస్తాం. అప్పటివరకు విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఆయా పాఠశాలల యాజమాన్యాలను కోరాం. – **రాజేశ్వర్‌గౌడ్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి**

బకాయిలు చెల్లించాలి



మా పాఠశాలలో 202 మంది విద్యార్థులు బీఏఎస్ కింద విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1.95కోట్లు రావాల్సి ఉంది. నిధులు సకాలంలో రాక ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలి. – **నాగభూషణం, విజయ హైస్కూల్ యజమాని**

ఉద్యోగుల గ్రామం రాజురా

- ప్రభుత్వ కొలువుల్లో 50 మంది
- 100శాతం అక్షరాస్యత ప్రత్యేకం

కుభీర్: మండలంలోని రాజురా చిన్న గ్రామం. 300 జనాభా ఉండగా, 240 మంది ఓటర్లున్నారు. అన్నీ వ్యవసాయాధారిత కుటుంబాలే. అయినప్పటికీ 100శాతం అక్షరాస్యత ఉంది. గ్రామంలో 50మంది దాకా ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఇందులో 10మంది ఉపాధ్యాయులు, 12 మంది డాక్టర్లు, నలుగురు ఆర్మీ ఉద్యోగులు, ముగ్గురు లాయర్లు, ఇద్దరు భూగర్భ జలవనరుల శాఖ శాస్త్రవేత్తలు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒకరు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి, ఒకరు ఇంజినీర్, ఒకరు ఎక్సైజ్ సీఐ, ఒకరు ఏఆర్ ఎస్సై, ఇద్దరు అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఒక అంగన్‌వాడీ టీచర్, ఒక ఆశ కార్యకర్త, ఒక అటెండర్ ఉన్నారు. ఐదుగురు రిటైర్డ్ ఉద్యోగులున్నారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ హోదాలో ఒకరు రిటైర్ట్ అయ్యారు.



రాజురా గ్రామ ముఖచిత్రం

వ్యవసాయాధారిత గ్రామమే..

రాజురా వ్యవసాయాధారిత గ్రామం. గ్రామస్తులందరికీ సాగు భూములున్నాయి. ఈ గ్రామంలో మూడు కులాలకు చెందినవారే ఉన్నారు. యాదవులు, మాల, మాదిగ కులస్తులుండగా వీరంతా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినప్పటికీ పిల్లలను చక్కగా చదివిస్తున్నారు. సోయా, కంది, పసుపు, కూరగాయలు పండిస్తారు. పండు ముసలివాళ్లకు కూడా చదవడం, రాయడం రావడం గమనార్హం.

పెద్దలే నాకు ఆదర్శం



నాకు మా పెద్దలే ఆదర్శం. మా తాత, మా నాన్న చదువుకున్నారు. మా ఇంట్లో ముగ్గురం ప్రభుత్వ ఉద్యోగులమే. గ్రామంలో ఒకరిని చూసి ఒకరు పోటీపడి పట్టుదలతో చదువుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. – **సీహెచ్ విలాస్, ఎక్సైజ్ సీఐ, నిజామాబాద్**

చాలా కష్టపడ్డా..



మా నాన్న ఉపాధ్యాయుడిగా పని చేశారు. మా నాన్నను స్ఫూర్తిగా తీసుకుని నేను కష్టపడి చదివాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. పట్టుదలతో చదివి బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం సంపాదించాను. – **సీహెచ్ సాయి, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి**

లక్ష్యం నెరవేరింది



నాకు చిన్నప్పటి నుంచి ఒక పెద్ద ఉద్యోగం సంపాదించాలని ఉండేది. గ్రామంలో పెద్ద ఉద్యోగాలు చేస్తున్నవారు చాలామంది ఉన్నారు. వారి స్ఫూర్తితో పట్టుదలతో ఉద్యోగం సాధించాను. – **సంజు, భూగర్భ జలవనరులశాఖ జిల్లా అధికారి, మహబూబ్‌నగర్**

గ్రామస్తుల స్ఫూర్తితో..



మా తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివించారు. గ్రామస్తులు సహకరించారు. మా ఊరిలో ఉద్యోగాలు చేసినవారిని స్ఫూర్తిగా తీసుకుని పట్టుదలతో చదివాను. అనుకున్నట్లే సర్కారు కొలువు కొట్టాను. – **అనిల్, ప్రొఫెసర్, వ్యవసాయ యూనివర్సిటీ, ఆదిలాబాద్**

ప్రభుత్వ భూముల స్వాధీనానికి చర్యలు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో గల లావుణి పట్టా భూముల్లో భూకబ్జాలను గుర్తించి ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్, పెంబి మండలాల కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుపై ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. ప్రభుత్వ భూమిని సమగ్ర సర్వే చేయిస్తామని, గతంలో చేసిన పలు కేటాయింపులకు హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే సర్వే వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి అందులో మరో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ విషయమై అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో మాట్లాడినట్లు తెలిపారు. సదర్మాట్‌తో పాటు డీ 27, డీ 28 ఆయకట్టు పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కొన్నేళ్లుగా పోడుభూములు సాగు చేస్తున్న వారందరికీ హక్కు పత్రాలు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. అంతకుముందు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని నిర్వహించారు. లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం సింగాపూర్ గ్రామంలోని పీరీల మండపంలో పూజలు చేశారు. క్యాంపు కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌తో నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పడిగెల భూషణ్, ఎంపీ మాజిద్, దయానంద్, చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, స్వప్నిల్‌రెడ్డి, చిన్నం రవీందర్, మాధవ్, నిమ్మనాయక్ తదితరులున్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

శ్యామాప్రసాద్ సేవలు చిరస్మరణీయం

నిర్మల్‌చైన్‌గేట్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దేశంలో జాతీయవాద రాజకీయానికి ముఖర్జీ అంకురార్పణే ఇవాళ బీజేపీ రూపంలో చూస్తున్నామని తెలిపారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్‌ను దేశంలో సమైక్య భాగంగా గుర్తించాలంటూ ఉద్యమించిన మహానేత ముఖర్జీ కలను ప్రధాని నరేంద్రమోదీ నెరవేర్చారని గుర్తు చేశారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రావణ్, రాజేందర్, శ్రావణ్‌రెడ్డి, భాస్కర్, చిన్నారెడ్డి, రామ్‌రెడ్డి, నారాయణగౌడ్, ప్రమోద్, ప్రకాశ్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశిని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. భైంసా పట్టణంలోని మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో విఠల, రుక్మాయి దేవతామూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. పురాణాబజార్‌లోని రాధాకృష్ణ భవన్ నుంచి బ్రాహ్మణగల్లి మీదుగా నిర్వహించిన శోభాయాత్రలో ఎమ్మెల్యే పీ రామారావు పటేల్ పాల్గొని పల్లకి మోశారు. దేవతామూర్తుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. – భైంసాటౌన్



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, భక్తులు

క్లుప్తంగా

చోరీకి పాల్పడిన ఆర్మీ జవాన్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: చోరీకి పాల్పడిన ఆర్మీ జవాన్‌ను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని పూసద్‌కు చెందిన గైక్వాడ్ అనిల్ రాజేంద్ర చెల్లెలు ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌లో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వచ్చిన ఆయన ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఐదు ఇత్తడి విగ్రహాలతోపాటు ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా, ఆదివారం నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్‌రావు వివరించారు.

ఐలాండ్‌ను ఢీకొన్న బైక్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మిటాకీస్ సమీపంలోని ఐలాండ్‌ను యువకుడు బైక్‌తో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన బీటెక్ చదువుతున్న విద్యార్థి కోదూరి సంజయ్ శనివారం రాత్రి మంచిర్యాల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. లక్ష్మి టాకీస్ సమీపంలో ఐలాండ్‌కు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు పంపించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతి



నియామకపత్రం అందుకుంటున్న తిరుపతి

పాతమంచిర్యాల: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన దెబ్బెట తిరుపతి నియామకమయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారి ప్రకాశ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర నాయకులకు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, జిల్లా అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ, కంకణాల సతీశ్ ఉన్నారు.

మెడికల్ బోర్డుపై మంత్రికి వినతి

శ్రీరాంపూర్: సింగరేణిలో జబ్బుపడిన కార్మికుల కోసం ప్రతీనెల సమావేశమయ్యే మెడికల్ బోర్డు ఆరు నెలలుగా జరగడం లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తోకల సురేశ్ తెలిపారు. ఈ మేరకు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి ఆదివారం వినతిపత్రం అందించారు. మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హయ్యర్ సెంటర్ రెఫరల్ అయిన కార్మికులైతే డ్యూటీలు లేక వేతనాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఓసీపీ కాంట్రాక్ట్ ఉద్యోగాలు 80 శాతం స్థానికులకే ఇవ్వాలని విన్నవించారు. దీనిపై కంపెనీ అధికారులతో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సురేశ్ తెలిపారు.

మీసేవలు సులభతరం

- అదనపు సేవలకు అవకాశం
- వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ల జారీ
- వినియోగదారులకు మరింత సౌలభ్యం

ఉమ్మడి జిల్లాలో మీ సేవ కేంద్రాలు	
ఆదిలాబాద్ 80	నిర్మల్ 113
మంచిర్యాల 139	కుమురంభీం 69



మీసేవా కేంద్రం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా సేవలను మరింత విస్తృతం చేసేందుకు శ్రీకారం చుట్టింది. అదనపు సేవలు వినియోగదారులకు సులభతరం చేసేందుకు అవకాశం కల్పించింది. ఇకపై వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ జారీకి నిర్ణయించింది. ఇందులో భాగంగా సంబంధిత స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రారంభించింది. వివాహ ధ్రువపత్రం కోసం దరఖాస్తుకు ఇరువురు దంపతుల ఆధార్‌కార్డులు వయస్సు పుట్టిన తేదీ, కుల, ఆదాయం ధ్రువపత్రాలు, పదో తరగతి సర్టిఫికెట్‌తోపాటు పెళ్లిఫొటోలు, ఆహ్వానపత్రం జతపర్చాల్సి ఉంటుంది. పెళ్లి చేసుకున్న ప్రాంతం, చిరునామా, వివాహ తేదీ భార్యాభర్తల వ్యక్తిగత వివరాలు, చిరునామా, వృత్తి, కులం, మతం తదితర అంశాలు పొందుపర్చాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుల తల్లిదండ్రుల పేర్లు, సాక్షిల వివరాలు వంటివి అందజేయాలి. న్యాయవాది వద్ద తీసుకున్న నోటరీతోపాటు వివాహం జరిగిన ప్రాంతం ఫంక్షన్‌హాల్ లేదా ఆలయం ద్వారా ధ్రువపత్రాలు సమర్పించాలి. వీటన్నింటిని మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఆ తర్వాత తగిన సమయం ప్రకారం స్లాట్‌బుక్ చేసుకుని ఆ తేదీ రోజున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముగ్గురు సాక్షులతోపాటు నవ దంపతులు హాజరుకావాల్సి ఉంటుంది. దరఖాస్తులను సబ్ రిజిస్ట్రార్ విచారణ అనంతరం వివాహ ధ్రువపత్రాన్ని జారీచేస్తారు.

మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్..

ఇంటి స్థలం వైశాల్యం, అపార్ట్‌మెంట్, స్థిరాస్తి ఉన్న ప్రాంతం ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువ నిర్ధారించుకోవడానికి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చు. దరఖాస్తు పరిశీలన అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ఆస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువపత్రాన్ని జారీచేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారుడు ఆధార్‌కార్డ్, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ స్థలం డాక్యుమెంట్లు, పన్నులు కట్టిన రసీదు గ్రామం, మండలం, జిల్లా వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. తగిన పరిశీలన అనంతరం ధ్రువీకరణపత్రాన్ని జారీచేస్తారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 401 మీసేవ కేంద్రాలు వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. 2011లో 10 రకాల సేవలతో ప్రారంభమైన ఈ కేంద్రాలు ప్రస్తుతం 40 శాఖలకు చెందిన 350 రకాల సేవలందిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మరో రెండు రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఆదివాసీ భవన్ ధ్వంసం



ధ్వంసమైన ఆదివాసీ భవన్

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని కుమురం భీం ఆదివాసీ భవన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గేటుతోపాటు భవన్ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి స్టేజీ టైల్స్ ఇతర వాటిని తొలగించారు. విద్యుత్ వైర్లు, బోర్డును అపహరించారు. ఆదివారం సమావేశం ఏర్పాటు చేద్దామని వెళ్లిన ఆదివాసీ నాయకులకు ఇలా కనిపించింది. ప్రశాంతంగా ఉన్న కెరమెరి మండలంలో ఈ చర్యలతో అలజడి ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఏదైన ఉంటే ముఖాముఖి తేల్చుకోవాలే తప్ప ఇలాంటి చేష్టలకు పాల్పడవద్దని వారు పేర్కొంటున్నారు. ఆకతాయిలు చేశారా? లేదా పెద్దలు వెనకుండి పక్కా ప్లాన్‌తో ఈ తతంగం నడిపించారా అనే అనుమానాలు ఆదివాసీలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

తప్పుడు పత్రాలతో ప్లాట్ విక్రయించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్ విక్రయించిన పట్టణానికి చెందిన జోగు రుపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సులిగల్ల సునీత 2013లో రూపేందర్ వద్ద నుంచి రూ.11 లక్షలకు రిక్షా కాలనీలో ఓ ప్లాట్ కొనుగోలు చేసింది. ఆ తర్వాత సునీత ఆ ప్లాట్‌ను విద్యానగర్‌కు చెందిన ఉమేశ్‌రెడ్డికి విక్రయించింది. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తి ప్లాట్ వద్దకు వెళ్లగా, ఈ ప్లాట్ తనదని, రిజిస్ట్రేషన్ తన పేరిట ఉందని పత్రాలు చూపించాడు. దీంతో మోసం చేసి వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం సునీత ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తిపై..

ప్లాట్ విక్రయించి డబ్బులు తీసుకుని ప్లాట్‌ను చూపించకుండా మోసగించిన పట్టణంలోని అంకోలి రోడ్డు వైపు ఉండే సయ్యద్ షాహిద్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. 2008లో పంజేషా మొహల్లాకు చెందిన విఖార్ అహ్మద్ ఎస్‌ఏ రియల్‌ఎస్టేట్ వ్యాపారి వద్ద రూ.38వేలకు భీంసరి సమీపంలో ప్లాట్ కొనుగోలు చేశాడు. ప్లాట్ చూపించకుండా తిప్పుకుంటున్నాడు. ప్లాట్ వద్దకు వెళ్లి చూడగా, మరో వ్యక్తికి ఆ ప్లాట్‌ను విక్రయించినట్లు తెలిసింది. బాధితుడు మోసపోయాడని తెలుసుకుని ఆదివారం ఫిర్యాదు చేశాడు.

నకిలీ పత్రాలతో మోసగించిన మహిళపై..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: నకిలీ పత్రాలతో మోసగించిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బృందావన్ కాలనీకి చెందిన దాసరి జ్యోతి గత మూడేళ్ల గేడం దేవిదాస్ జ్యోత్స్న దంపతులకు ఖానాపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 68/100/2లో 764 నంబర్ గల (30గీ40) సైజు ప్లాటు కొనుగోలు చేయించింది. ఆ తర్వాత రూ.3.30 లక్షలు వసూళ్లు చేసి నకిలీ పత్రాలతో తమను మోసగించిన దాసరి జ్యోతితోపాటు పలువురిపై జ్యోత్స్న ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం జ్యోతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహమ్మద్ కలీమ్‌తో పాటు పలువురు పరారీలో ఉన్నారు. సమావేశంలో ఎస్సై విష్ణు వర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల మృతికి కారకులైన ఇద్దరిపై..

ఆదిలాబాద్‌రూరల్: మావల బంజారాహిల్స్ శివారు ప్రాంతంలో రోడ్డుకు అనుకుని ఉన్న నీటికుంటలో ప్రమాదవశాత్తు పడి చిన్నారుల మృతికి కారకులైన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల మండల కేంద్రానికి చెందిన స్వామి, గీత దంపతుల కుమారులు వినూత్న (11), విదాత్ (10)లు శనివారం సైకిల్ ఆడుకుంటూ బంజారాహిల్స్ రోడ్డు గుండా వెళ్తున్నారు. మార్గమధ్యలో నిర్మల్కర్ భాస్కర్‌కు చెందిన భూమిలో ఉన్న నీటికుంటలో పడ్డారు. దీంతో వారు అక్కడికి అక్కడే మృతి చెందారు. అయితే ఆదిలాబాద్‌లోని భుక్తపూర్ కాలనీకి చెందిన యతేంద్రనాథ్ యాదవ్‌కు పట్టేదారు అభివృద్ధి, భూమి నిర్వహణ కోసం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా ఆ భూమిని ఇచ్చారు. వారి నిర్లక్ష్యంతోనే చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందారని ఆరోపిస్తూ మావల తహసీల్దార్ వేణుగోపాల్, మృతుల తండ్రి స్వామి ఇరువురు ఆదివారం ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బీసీ మేధావుల ఫోరం కార్యవర్గం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా శ్రీరాముల కొండయ్య, కోఆర్డినేటర్లుగా డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, రంగు రాజేశం, కనుకుట్ల మల్లయ్య, షబ్బీర్ పాషా, సమ్ము రాజయ్య, కోదూరి చంద్రయ్య, అశోక్ యాదవ్, తునికి ప్రవీణ్, అక్కల నాగరాజు, జైనుద్దీన్, లింగమూర్తి, రవి ఎన్నికయ్యారు. రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు వారికి నియామకపత్రాలు జారీ చేశారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



రూప (ఫైల్)

దండేపల్లి: అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. లక్సెట్టిపేట మండలం సురారం గ్రామానికి చెందిన పొరండ్ల శంకరయ్య కుమార్తె రూప (22)ను దండేపల్లి మండలం గుడిరేవుకు చెందిన అల్లె మహేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి రెండేళ్ల బాబు ఉన్నాడు. మహేశ్ ఉపాధి కోసం పది నెలల క్రితం సింగపూర్‌కు వెళ్లాడు. పెళ్లయిన కొన్నినెలల నుంచే మహేశ్ రూపను వేధింపులకు గురిచేసేవాడు. ఫోన్లలో వేధించసాగాడు. ఈ విషయం రూప తల్లిదండ్రులకు చెప్పడంతో ఇద్దరికి నచ్చజెప్పారు. నాలుగురోజుల క్రితం ఏదో మెసేజ్ వచ్చిందని అత్తమామలు లక్ష్మి, పుల్లయ్య, ఆడబిడ్డ అల్స మమత, ఆమె భర్త సుమన్‌లు ఆమెను వేధింపులకు గురిచేశారు. భర్త మహేశ్ కూడా ఫోన్‌లో వేధించాడు. ఈ విషయాన్ని రూప తన తండ్రికి ఫోన్‌లో చెప్పి ఎడువడంతో నచ్చజెప్పారు. ఈక్రమంలో రూప శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గుడిరేవుకు చెందిన కాసారపు సాయికిరణ్ ఈ విషయాన్ని రూప తండ్రికి ఫోన్‌లో చెప్పి లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. వెంటనే శంకరయ్య కుటుంబీకులు అక్కడికి చేరుకున్నారు. రూపను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో అత్తమామలు లక్ష్మి, పుల్లయ్య, భర్త మహేశ్, ఆడబిడ్డ అల్స మమత, ఆమె భర్త సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూతురు, అల్లుడికి గొడవలు మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

కుభీర్: కూతురు, అల్లుడికి మధ్య గొడవలతో మనస్తాపం చెందిన తండ్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన నీలకంఠ గోవిందు (64)కు భార్య, కుమార్తె నర్మద, అల్లుడు అందరూ ఒకేచో ఉండేవారు. కూతురు, అల్లుడు తరచూ గొడవపడేవారు. దీంతో మనస్తాపం చెందిన నీలకంఠ గోవిందు ఆదివారం ఉదయం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రిష్టారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తాండూర్: మండలంలోని బోయపల్లి బోర్డు సమీపంలో జాతీయ రహదారిపై శనివా రం రాత్రి జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై డి.కిరణ్‌కుమా ర్ కథనం ప్రకారం..ఓదెలు గ్రామానికి చెందిన అయిలి మల్లేశ్‌గౌడ్ (36) గీత కార్మిక వృత్తిరీత్యా కాసిపేటలో భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. మల్లేశ్‌గౌడ్ శనివారం రాత్రి బోయపల్లి బోర్డు సమీపంలోని దాబాలో బిర్యానీ తీసుకున్నాడు. తిరిగి బైక్‌పై బోయపల్లి బోర్డు వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రాధిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి మహిళ మృతి

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కాలేజీరోడ్‌లో గల గోదావరి నదిలో ఆదివారం స్నానం ఆచరించేందుకు వచ్చిన మహిళ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. సోమగూడెంకు చెందిన మద్దెల లక్ష్మి (54) తొలి ఏకాదశి సందర్భంగా గోదావరిలో స్నానం ఆచరించేందుకు వచ్చింది. ప్రమాదవశాత్తు నీటిలో మునిగింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి ఆధార్ కార్డు పరిశీలించగా కోటపల్లి మండలం నాగంపేట్ అడ్రస్‌తో ఉంది. లక్ష్మి భర్త రాజలింగు సింగరేణి ఉద్యోగి అని తెలిసింది. కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్మికుడికి గాయాలు

జిల్లా కేంద్రంలో ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో కార్మికుడికి తీవ్రగాయలైనట్లు ఎస్సై తిరుపతి తెలి పారు. ఆయన కథనం ప్రకారం..పశ్చిమబెంగాల్‌కు చెందిన భానుదేవ్ ఆదివారం పనులు నిర్వహిస్తుండగా లిఫ్ట సహాయంతో రోప్‌ద్వారా బకెట్‌లో ఇటుకను 3వ అంతస్తుకు తరలిస్తుండగా ప్రమాదవశా త్తు క్రేన్ రోప్ తెగింది. ఇటుక బకెట్ కిందపడడంతో భానుదేవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎం అస్పత్రికి పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసాటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాండ్రిగల్లికి చెందిన సయ్యద్ ముజీం(42) మేస్త్రి పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈక్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో, కుటుంబానికి భారం కావద్దనే ఉద్దేశంతో ఆదివారం కుంచావలి గుట్ట సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో కీలక నిందితుడు అరెస్ట్

నిర్మల్‌టౌన్: పట్టణానికి చెందిన ఇద్దరిపై ఇటీవల దాడికి పాల్పడి కిడ్నాప్ చేసిన ఐదుగురు సభ్యుల ముఠాలో కీలక నిందితుడైన ఇబ్రహీం బిల్డర్ అలియాస్ అబ్దుల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన తాహెర్ బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. అదేవిధంగా మహారాష్ట్రలోని ధర్మబాద్‌కు చెందిన షేక్ రౌఫ్, భైంసాకు చెందిన రహీజ్‌లు కూడా బియ్యం వ్యాపారం చేస్తున్నారు. వీరికి తాహెర్‌తో పరిచయం ఉంది. ఈక్రమంలో తాహెర్‌ను రూ.4 లక్షలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో తాహెర్‌ను కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నారు. భైంసాకు చెందిన ఇటుకల వ్యాపారి ఇబ్రహీం బిల్డర్‌కు రూ.1.50 లక్షల సుఫారీ ఇచ్చారు. సల్మాన్, మహమ్మద్ సోహెల్ మరోఇద్దరితో కలిసి ఇబ్రహీంలు పట్టణంలోని బైల్ బజార్ వద్ద తాహెర్ వాహనాన్ని అడ్డుకుని అందులో ఉన్న డ్రైవర్లపై దాడి చేసి కిడ్నాప్ చేశారు. ఈ విషయమై డ్రైవర్ నుమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక సోఫినగర్ ప్రాంతంలో ఇబ్రహీం ఉన్నాడని పక్కా సమాచారంతో ఈనెల 5న పట్టణ సీఐ దాడి చేశారు. స్థానిక దర్గా వద్ద అతన్ని అరెస్టు చేసి కత్తి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

యూరియా కోసం బారులు



క్యూకట్టిన రైతులు



బారులు తీరిన మహిళలు

నార్నూర్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులు, మహిళలు బారులు తీరారు. 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలియడంతో ఆదివారం ఉదయం 5 గంటలకు వారు తరలివచ్చారు. మండలానికి 300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 100 మెట్రిక్ టన్నులు వచ్చిందని, సోమవారం మరో 50 మెట్రిక్ టన్నులు వస్తుందని సీఈవో అడే గణేశ్ తెలిపారు. సొసైటీ కేంద్రంలో ఉన్న 400 బ్యాగులు ముందు వరుసలో ఉన్నవారికే దొరికాయి. దీంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి సరిపడా ఎరువులు అందించాలని కోరుతున్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



సంతోష్ (ఫైల్)

నర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అబుదాబి వెళ్లిన మండలంలోని టెంబుర్నికి చెందిన బొగుడమీది సంతోష్ వారం రోజుల్లోపే మృతిచెందాడు. ఆదివారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బొగుడమీది సంతోష్ (36) గతనెల 22న విజిట్ వీసాపై దుబాయ్‌లోని అబుదాబి వెళ్లాడు. మరుసటి రోజు బయటికి వెళ్లి తిని వస్తానని చెప్పి గదికి తిరిగి రాలేదు. ఈ విషయాన్ని తోటి కార్మికులు గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ యూఏఈ ప్రతినిధి గడ్పంద నరేందర్‌కు సమాచారం అందించారు. ఆయన అబుదాబిలోని ఇండియన్ ఎంబసీకి సమాచారం చేరవేశారు. బాధిత వ్యక్తి విజిట్ వీసాపై వెళ్లి ఉండటంతో కంపెనీ వివరాలు సత్వరమే తెలియరాలేదు. అక్కడి గల్ఫ్ వెల్ఫేర్ ప్రతినిధులు ఆరాతీయగా గతనెల 27న మృతి చెందినట్లు ఎంబసీ అధికారులు వెల్లడించారు. స్వగ్రామంలో ఉన్నప్పుడు తెల్లకల్లు సేవించడం అలవాటు ఉన్న సంతోష్ అబుదాబి వెళ్లాక అది లభించకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి మృతి చెందినట్లు తెలిపారు. ఇండియన్ ఎంబసీ ద్వారా అక్కడి సంఘ ప్రతినిధులు శంకర్ లావుడ్యా, అబుదాబి సమన్వయకర్త కల్లెడ నరేశ్ ఆ మృతదేహాన్ని స్వస్థలానికి పంపించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్వగ్రామానికి మృతదేహం చేరగా కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ప్రేమల, కుమారుడు సాయి చరణ్, కూతురు నితీక్ష ఉన్నారు.



సంతోష్ మృతదేహాన్ని అబుదాబి ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్న గల్ఫ్ వెల్ఫేర్ ప్రతినిధులు

గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టాలి

గ్రామీణులకు ఆశ చూపి మంచి వేతనంతో అవకాశం కల్పిస్తామని గల్ఫ్ దేశాలకు విజిట్, టూరిస్ట్ వీసాలపై పంపుతూ ఏజెంట్లు చేస్తున్న మోసాలను అరికట్టాలని యూఏఈ గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం ప్రతినిధులు గడ్పంద నరేందర్, శంకర్, వంశీగౌడ్, రవి, నరేశ్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో చేసే ఉద్యోగం పట్ల ముందుగానే పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే వెళ్లాలని సూచించారు.

కుంసరలో దొంగల హల్‌చల్



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. సొలంకి అబారావు, సులోచన, మాధవ్, సురేందర్‌రెడ్డి ఇళ్లలో దొంగలు చొరబడి బీరువాలను పగులగొట్టారు. నగదు, బంగారం దొరకకపోవడంతో సామగ్రిని చిందరవందరగా పారేశారు. సురేందర్‌రెడ్డి బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని స్థానికులు బాధితులు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సైలు శంకర్, సుప్రియలు ఆదివారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న పుట్టగొడుగులు



తరచూ కురుస్తున్న వర్షాలకు గొడుగుల్లాంటి ఆకృతిలో ఉండే చిన్న,చిన్న పుట్టగొడుగులు సైతం పుట్టుకొస్తున్నాయి. వివిధ పరిమాణాల్లో, రూపాల్లో ఉండడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం, ఆర్‌అండ్‌బీ గెస్టహౌజ్, మహబూబ్ ఘాట్స్ సెక్షన్‌లో సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, నిర్మల్



